సాక్షి మంచిర్యాల

మంగళవారం, 18, జూలై, 2023



ప్రబలుతున్న వ్యాధులు

జిల్లాలో సీజనల్ వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. వైరల్ జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే ఏడు డెంగీ కేసులు నమోదయ్యాయి. 8లో▸



పంచాయతీ కార్మికుల నిరసన

డిమాండ్లు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సోమవారం వినూత్న రీతిలో నిరసనలు వ్యక్తం చేశారు. సమ్మెకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

వాతావరణం

జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

బోనస్ రాలే !



అటవీ నుంచి కూలీలు సేకరించి ఆరబెట్టిన తునికాకు కట్టలు(ఫైల్)

- తునికాకు కూలీలకు తప్పని తిప్పలు
- మొదటి దఫాలో కొందరికే డబ్బులు జమ
- బ్యాంకు ఖాతాలు సరిలేక అంటున్న అధికారులు
- జిల్లాలో అనేకమంది నిరుపేదల ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/మందమర్రిరూరల్: తునికాకు సేకరించిన కూలీలకు బోనస్ డబ్బులు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇంకా వేలాది మంది కూలీలకు బోనస్ చెల్లించాల్సి ఉంది. గత మార్చిలో రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా జిల్లాలో చెక్కుల పంపిణీ ప్రారంభించారు. కొందరు కూలీలకు మాత్రమే డబ్బులు జమ అయ్యాయి. ఇప్పటికీ అనేకమంది చేతికి పైసలు అందడం లేదు. దీంతో ఏళ్లు గడుస్తున్నా డబ్బులు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ డబ్బులు చేతికి వస్తే తమ ఆర్థిక అవసరాలు తీరుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయల్టీ బోనస్‌గా చెల్లింపు

తునికాకు సేకరణలో ఆయా యూనిట్లకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు చెల్లించే రాయల్టీ డబ్బులను తిరిగి కూలీలకే బోనస్‌గా చెల్లించే విధానం అప్పటి సీఎం, దివంగత వైఎస్సార్ ప్రభుత్వ హయాం నుంచి మొదలైంది. ఆ తర్వాత అదే తీరుగా బోనస్ చెల్లిస్తున్నారు. ఏటేటా ఆకు సేకరణ పూర్తయి, కేవలం కూలీ డబ్బులు మాత్రమే చెల్లింపులు జరుగుతున్నాయి. ఆ తర్వాత చాలా ప్రాంతాల్లో తునికాకు సేకరణ తగ్గిపోవడంతో నిలిచిపోయింది. కరోనా సమయంలో రెండేళ్లు నిలిచిపోయాయి. టైగర్‌జోన్, రక్షిత అటవీ ప్రాంతాల్లో నిషేధంతో సేకరణ తగ్గిపోయింది. జిల్లాలో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, జన్నారం అటవీ డివిజన్లలో ఆకుల సేకరణ జరుగుతోంది. ప్రస్తుతం 50ఆకుల కట్టకు రూ.3గా నిర్ణయించి ఈ సీజన్‌లో సేకరించారు. ఇంకా చాలామంది నిరుపేదలే ఈ తునికాకు సేకరణలో ఉంటున్నారు. జిల్లాలో దాదాపు 70వేల మంది వరకు కూలీలుగా నమోదై ఉన్నారు. గత నాలుగేళ్లకు జిల్లాలో రూ.27కోట్ల బోనస్ చెల్లింపుల కోసం కూలీల వివరాలు సేకరించారు. ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని చెబుతున్నా ఇప్పటికీ ఇంకా చాలామందికి అందలేదు.

నాలుగేళ్ల బోనస్ పెండింగ్

రాష్ట్ర వ్యాప్తంగా 2016నుంచి 2021మధ్య వరకు కూలీలకు బోనస్ రాలేదు. గత మార్చిలో ఆ పెండింగ్ మొత్తాన్ని చెల్లించాలని అటవీ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. గతంలో మాదిరి కాకుండా కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు అకౌంట్లు తీసుకున్నారు. కానీ కొందరి అకౌంట్లు సరిగా లేకపోవడంతో జమ కాలేదు. ఒక కల్లం బదులు మరో కల్లం, నమోదు కావడం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, అకౌంట్లు మనుగడలో లేకపోవడం, గ్రామీణ బ్యాంకు ఖాతాలు తదితర కారణాలతో తిరస్కరించినట్లు చెబుతున్నారు. కానీ చాలామందికి అన్ని వివరాలు సరిగా ఉన్న వారికి సైతం డబ్బులు రాలేదని వాపోతున్నారు. ఇక కొందరి వివరాలు ఇప్పటికే రెండుసార్లు తీసుకున్నారని అయినా డబ్బులు రాలేదంటున్నారు. రూ.20వేల లోపు ఉన్న వారికి డబ్బులు జమ చేసి, ఆపై ఉన్న వారికి జమ కాలేదని కూలీలు, కల్లెదారులు చెబుతున్నారు. ఓ బ్యాంకు ఖాతాదారులకే అధికంగా మరో బ్యాంకు ఖాతాదారులకు తక్కువగా జమ చేసినట్లు చెబుతున్నారు. 2016, 2017కు సంబంధించిన బోనస్‌లో కొంత మేర జమ అయినట్లు చెబుతున్నారు.

రెండు సార్లు వివరాలు ఇచ్చాను



నాకు తునికాకు కూలీ బోనస్ రూ.12వేలు రావాలి. ఇప్పటికీ డబ్బులు పడడం లేదు. బ్యాంకు పాస్‌బుక్ వివరాలు ఇవ్వమంటే రెండు సార్లు ఇచ్చాను. కానీ డబ్బులు జమ కాలేదు.
– సప్పిడె సాంబయ్య, తునికాకు కూలీ, వేమనపల్లి

ఆరువేలు రావాల్సి ఉంది



పదేళ్లుగా తునికాకు సేకరిస్తున్న. గత నాలుగేళ్ల బోనస్ రూ. ఆరువేల వరకు రావాలి. కూలీ డబ్బులు వచ్చినా బోనస్ రావడం లేదు. బ్యాంకు వివరాలు కూడా అందజేసిన. త్వరగా డబ్బులు పడేలా చూడాలి.
– చెన్నూరి పోషమల్లు, తునికాకు కూలీ, ఆదిల్‌పేట్

అందరికీ బోనస్ అందుతాయి



తునికాకు సేకరించిన కూలీలందరికీ బోనస్ అందుతాయి. ఇప్పటికే కూలీలకు బోనస్ డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. కొన్ని బ్యాంకు అకౌంట్లు తిరస్కరణకు గురైన వివరాలు మాకు వచ్చాయి. వాటిని సరిచేసి మళ్లీ పంపుతున్నాం. ఇంకా డబ్బులు జమ కాక ఏదైనా సమస్య ఉంటే స్థానిక అటవీ రేంజీ ఆఫీసులో తమ వివరాలు చెప్పి సరి చేసుకోవాలి.
– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీ అధికారి

న్యూస్‌రీల్

వర్షపు నీరు నిలువకుండా చర్యలు



బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్

జైపూర్: ఓపెన్‌కాస్టు క్వారీలో వర్షపు నీరు నిలువకుండా ముందుస్తుగా చర్యలు చేపట్టాలని సింగరేణి డైరెక్టర్(పీపీ) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని సోమవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓపెన్‌కాస్టు గని పని ప్రాంతాలను పరిశీలించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని, ఓబీ ఉత్పత్తి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకే–ఓసీపీ అధికారి ఎం.శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్, బ్రహ్మజీ, తదితరులు పాల్గొన్నారు.

డిస్మిస్ కార్మికులకు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న అంతోటి నాగేశ్వరరావు

శ్రీరాంపూర్: సింగరేణిలో డిస్మిస్ కార్మికులకు వన్ టైం సెటిల్‌మెంట్ కింద అవకాశం కల్పించి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు యాజమాన్యాన్ని కోరారు. సోమవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అనారోగ్య కారణాలు, కుటుంబ సమస్యలు, ఇతరత్రా ఇబ్బందులతో కొంతమంది కార్మికులు డ్యూటీలు చేయకపోవడం వల్ల కంపెనీ డిస్మిస్ చేసిందని తెలిపారు. మానవత దృక్పథంతో తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎంవీ రావు, కేంద్ర కమిటీ సభ్యులు ఇరుగుల శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్ డేగల ప్రవీణ్, కో కన్వీనర్ రెడపాక లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీ వెంకటేష్, పిట్ సెక్రెటరీలు సంగం సతీష్, దేవి, శ్రీనాథ్, కొండ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో గురుకుల ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద ఉపాధ్యాయులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి ఆరేళ్లు గడిచినా సొంత భవనాలు లేవని ఆరోపించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధనకు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అన్ని సొసైటీల్లో ఏకరూప పాలన అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, ఉమ్మడి జిల్లా పూర్వ జిల్లా అధ్యక్షుడు ఆగాచారి, కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శులు చంద్రమౌళి, కిరణ్‌కుమార్, సంతోష్‌కుమార్, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే7 గనిని సందర్శించిన జడ్జి



గనిలోకి దిగుతున్న జడ్జి సంపత్

శ్రీరాంపూర్: ఆర్కే 7 గనిని చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.సంపత్ సోమవారం సందర్శించారు. ఆయనను గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్ గనికిలోకి దింపి బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. పని స్థలాలు, కార్మికులు పని చేసే విధానం వివరించారు. ఈ సందర్భంగా జడ్జి కార్మికులతో మాట్లాడి శ్రమ విధానం తెలుసుకున్నారు. గనిలో దిగడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై కే.రాజేశ్, గని సంక్షేమ అధికారి సంతన్, అడ్వకేట్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రైవేటుకు వెళ్లే గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 అర్బన్ హెల్త్ సెంటర్ల సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని గర్భిణులను వందశాతం నమోదు చేయాలని, తేదీల వారీగా స్కానింగ్, వైద్య పరీక్షలు జరిగేలా చూడాలని, జిల్లాలో 70 శాతం ప్రసవాలు ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతున్నాయని, అందుకు గల కారణాలు తెలుసుకోవాలని సూచించారు. కేసీఆర్ కిట్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్‌ఖాన్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

బాలల భవితకు తొలిమెట్టు



ఎఫ్ఎల్ఎన్ అభ్యసన కార్యక్రమంలో విద్యార్థులు(ఫైల్)

- మరోసారి కొనసాగింపు
- రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ
- ఆగస్టులో లిప్ అమలుకు సన్నద్ధత

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించి విద్యాప్రమాణాలు పెంచేందుకు విద్యాశాఖ గత ఏడాది ఆగస్టు 16నుంచి ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమం కొనసాగింపునకు చర్యలు చేపట్టింది. విద్యార్థుల ప్రాథమిక సామర్థ్యాలతోపాటు సబ్జెక్టు వారి తరగతి అభ్యసన ఫలితాలే సాధన లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఎఫ్ఎల్ఎన్(తొలిమెట్టు)కు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు మెరుగు కావడంతో ఈ ఏడాది కూడా కొనసాగించాలని విద్యాశాఖ యోచిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయి రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇచ్చింది. ఉన్నత తరగతుల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు, భాషపరిజ్ఞానం పెంపునకు లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(లిప్) కార్యక్రమాన్ని అమలు చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఆగస్టులో మొదలు కానున్నట్లు తెలుస్తోంది.

పాఠ్యప్రణాళిక హ్యాండ్‌బుక్స్..

విద్యార్థులకు వర్క్‌బుక్స్

ప్రణాళికాబద్ధమైన పాఠ్యప్రణాళికలు రూపొందించుకుని బోధిస్తూ, విద్యార్థుల అభ్యసన ఫలితాల సాధన కోసం పలు రకాల అభ్యసన కృత్యాలతో బోధనాభ్యసన ప్రక్రియ సాగింది. కొన్ని చోట్ల కొంతమంది ఉపాధ్యాయులకు ఏకోపాధ్యాయ పాఠశాలలు, విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట పాఠ్యప్రణాళి కలు సొంతంగా రూపొందించుకోవడం, విద్యార్థులతో అభ్యాస కృత్యాలు చేయించడం కష్టతరంగా మారింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సమస్యని సానుకూలంగా పరిష్కరిస్తూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నమూనా పాఠ్యప్రణాళిక హ్యాండ్‌బుక్, విద్యార్థులకు అభ్యసన కృత్యాలు చేయడానికి అత్యద్భుతమైన వర్క్‌బుక్స్‌ను పాఠశాలకు అందించనున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ ఇలా..

జిల్లాలో 484 ప్రాథమిక, 96 ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి రిసోర్సు పర్సన్లు పది మంది 13వ తేదీ నుంచి 15 వరకు శిక్షణ పొందారు. ఈ నెల 19నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు సబ్జెక్టుల వారీగా తర్ఫీదు ఇస్తారు. మొత్తం 1,195 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. రాష్ట్రస్థాయి రిసోర్సుపర్సన్లు జిల్లాస్థాయిలో 19 నుంచి 21 వరకు ఆయా మండలాల నుంచి వచ్చిన 108మంది టీచర్లకు శిక్షణ ఇస్తారు. జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్లు మండలస్థాయిలో 24, 25వ తేదీల్లో తెలుగు ఉపాధ్యాయులకు, 26, 27న గణితం, ఈ నెల 31, ఆగస్టు 1న ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.

లిప్ అమలుకు సన్నద్ధత

ప్రాథమిక స్థాయిలో అమలు చేసిన తొలిమెట్టు స్ఫూర్తితో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 2023–24 సంవత్సరంలో ఆగస్టులో అభ్యసనాభివృద్ధి పథకం(లిప్) కార్యక్రమానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు లిప్ అమలుకు కార్యాచరణ రూపొందించారు. జిల్లాలోని 1008 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. లిప్ అమలుపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు అసవరసమైన సిలబస్ కరదీపికలు(మాడ్యూల్స్) రూపొందించారు. విషయ నిపుణులతో వాటిని పరిశీలన చేయించి తుది రూపు ఇచ్చేందుకు కార్యశాల ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు విద్యార్థుల్లో లోపాలను సరిదిద్దేందుకు తొలిమెట్టు స్ఫూర్తితో లిప్ అమలుకు నిర్ణయించారు. ఎస్‌సీఈ ఆర్టీ ఆదేశాలు రాగానే జిల్లా స్థాయిలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు లిప్ అమలుపై శిక్షణ ఇప్పించేందుకు సన్నద్ధం చేస్తున్నారు.

కొనసాగింపుగా..

తొలిమెట్టు కొనసాగింపుగా ఈ ఏడాది అమలు కానుంది. జిల్లాలో ఉపాధ్యాయులందరూ శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని బోధిస్తూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి. ఈ నెల 19 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, 24నుంచి ఆగస్టు 1వరకు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి.
– యాదయ్య, డీఈవో

'ధాన్యం డబ్బులు అడిగితే దాడులా..?'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ధాన్యం కొనుగోలు సమయంలో తరుగు పేరిట తక్కువ తూకం వేస్తున్నారని, 47 బస్తాలకు 40 బస్తాల డబ్బులు మాత్రమే ఖాతాలో వేశారని ప్రశ్నించిన రైతు జంగిలి ముత్తయ్యపై బీఆర్ఎస్ నాయకుడి దాడిని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఖండించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు అధికారమే ముఖ్యమని, ప్రజాసంక్షేమంపై పట్టింపు లేదని విమర్శించారు. గాయపడిన రైతుకు కాంగ్రెస్ పార్టీ వైద్య ఖర్చులు భరిస్తుందని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

మంచిర్యాల జిల్లాతోపాటు నియోజకవర్గంలో తొమ్మిదినరేళ్లుగా కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తల కోసం కష్టపడుతున్నానని, దేశం, రాష్ట్రంలో మంచిర్యాలకు పార్టీ కార్యకలాపాల్లో నంబర్‌వన్ స్థానాన్ని కల్పించానని ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. కొందరు ప్రత్యర్థులు కావాలనే తాను పార్టీ మారుతున్నానంటూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రభుత్వంలోనూ తనకు సముచిత స్థానం ఉంటుందని ఉంటుందనే ధీమా వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ జాగరణ

మంచిర్యాలఅర్బన్: సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ జాగరణ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ తెలిపారు. సోమవారం మంచిర్యాల తపస్ కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 317 ద్వారా స్థానికతను కోల్పోయి అనేకమంది టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పండితులు, పీఈటీల ఉన్నతీకరణ చేయడం లేదని ఆరోపించారు. 2002, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పింఛన్ విధానం అమలు చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం పేర్కొన్నారు. ఈ నెల 18నుంచి 22వరకు కాంప్లెక్స్ స్థాయిలో సంతకాల సేకరణ, 25న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన, 31న ఆర్డీవోలకు వినతిపత్రాలు, ఆగస్టు 5న కలెక్టర్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ఆగస్టు 18న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపడుతామని పేర్కొన్నారు. సమావేశంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బగ్గని రవికుమార్, జిల్లా బాధ్యులు చీర సమ్మయ్య, ఎంవీఎం గోపాల్‌రావు, నీలేష్‌కచ్వాల్, మండల బాధ్యులు శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

రూ.లక్ష సాయం ఆలస్యం..?

- ఈ నెల 15 నుంచే ప్రారంభం కావాలి
- అర్హుల జాబితా తయారీలో జాప్యం
- ఎమ్మెల్యేల వద్దకు చేరిన జాబితా

మంచిర్యాలటౌన్: బీసీల్లోని చేతి, కులవృత్తిదారులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీలో జాప్యం జరుగుతోంది. గత నెలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించగా.. ఈ నెల 15నుంచి అర్హులకు అందించాల్సి ఉంది. కానీ జిల్లాలో ఇప్పటికీ ప్రారంభం కాలేదు. మొదట నియోజకవర్గానికి 50 చొప్పున ఇవ్వాలని నిర్ణయించగా, ఆ తర్వాత 300 చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. నియోజకవర్గాల వారీగా దరఖాస్తులను మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సర్వేకు సిబ్బందిని నియమించారు. కానీ కొందరి వద్దకే వెళ్లి దరఖాస్తులను పరిశీలించగా, మిగతా వారిని ఫోన్లలోనే సంప్రదించి సర్వే పూర్తి చేశారు. జిల్లాలో 11,106 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, అందులో 8,790 మంది పురుషులు, 2,316 మంది మహిళలు ఉన్నారు. వీరిలో అర్హులైన వారిని సర్వే ద్వారా 7,700 మంది గుర్తించారు. వీరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, కుటుంబ సమగ్ర సర్వే ఆధారంగా 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తో నిబంధనల ప్రకారం లేని 4,700 మందిని తొలగించగా, 3 వేల మందిని అర్హులుగా గుర్తించినట్లు సమాచారం. ఈ జాబితా నుంచి మొదటి నెలలో 300 మందిని ఎవరిని గుర్తించి సాయం అందించాలనే దానిపై ఎమ్మెల్యేలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒక్కో గ్రామానికి ఒకటి రెండు, మున్సిపాలిటీలోనూ ఒక్కో వార్డులో ఒక్కరు లేదా ఇద్దరికి మాత్రమే ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. లక్ష సాయం చేసిన తర్వాత వారిలో ఎవరైనా అనర్హులుంటే ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు వస్తుందనే భావన ఎమ్మెల్యేల్లో ఉంది.



మంచిర్యాలలో దరఖాస్తున్న చేసుకున్న వారి వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

అనర్హులే అధికం..

దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది కులవృత్తులపైనే ఆధారపడకుండా ఇతరత్రా వ్యాపకాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆర్థికంగా బాగా ఉన్నవారు, ఆదాయపన్ను చెల్లిస్తున్న వారు, కార్లు, ఇళ్లు, పొలాలు ఉన్నవారు, ఆర్థికంగా స్థిరపడిన వారు కావడంతో ఎక్కువగా దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు తెలిసింది. వీరితోపాటు 2018లో ప్రభుత్వం అందించిన రూ.50 వేల ఆర్థిక సాయాన్ని పొందిన వారు కూడా ఉండడం, ఒకే కుటుంబానికి చెందిన వారిలో ఒక్కరికి మాత్రమే అవకాశం ఇచ్చినా, ఇద్దరు ముగ్గురు దరఖాస్తు చేసుకోవడం తిరస్కరణకు కారణంగా తెలుస్తోంది.

అర్హులకు సాయం అందిస్తాం

అర్హులైన వారి జాబితాలో పేర్లు ఉన్న ప్రతీ ఒక్కరికి రూ.లక్ష సాయాన్ని అందిస్తాం. ప్రతి నెల 15వ తేదీ తరువాత నియోజకవర్గంలో 300 మందికి చొప్పున ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం నుంచి విడుదల చేసే నిధులు, ప్రకటించే జాబితా ప్రకారంగా ప్రతీ ఒక్కరికి సాయం అందుతుంది. అర్హుల జాబితాను కలెక్టర్ ప్రకటించనుండగా, జిల్లాలో ఎప్పుడు సాయం అందిస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. జాబితా రాగానే, నిధుల విడుదల ప్రకారం రూ.లక్ష సాయం అందిస్తాం.
– వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మైదం రమేశ్ (ఫైల్)

భీమిని: మండలంలోని మల్లిడి గ్రామానికి చెందిన మైదం రమేశ్ (48) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కూతురు వివాహానికి చేసిన రూ.4 లక్షల అప్పులు తీర్చలేక రమేశ్ మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఈనెల 1న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి అటు నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



అంజి(ఫైల్)

దండేపల్లి: మండలంలోని ఇప్పల గూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ ఆత్రం అంజి(20) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి సోమవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం..రెబ్బనపల్లి శివారులోని పొలంలో కేజీవీల్స్ ట్రాక్టర్‌తో జంబు కొడుతుండగా, ప్రమాదవశాత్తు పొలంలో బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజిన్ కింద బురదలో ఇరుక్కున్న అంజి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ విషయమై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా, ఫిర్యాదు అందలేదు. మృతదేహాన్ని ప్రమాద స్థలం నుంచి లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని పేర్కొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకున్న కార్మికులు



ట్రాక్టర్‌కు అడ్డంగా కూర్చున్న కార్మికులు

నెన్నెల: మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ ట్రాక్టర్‌ను పారిశుధ్య కార్మికులు సోమవారం అడ్డుకున్నారు. 12 రోజులుగా కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామంలో చెత్త పేరుకుపోయింది. సర్పంచ్ సుజాత, కార్యదర్శి సాగర్ ప్రైవేటు వ్యక్తుల సహాయంతో ట్రాక్టర్‌ను నడిపిస్తూ చెత్త సేకరణ చేస్తుండగా కార్మికులు అడ్డుకుని ట్రాక్టర్ ముందు కూర్చుని నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు అందరూ సహకరించాలని కోరారు. 12వ రోజు సోమవారం సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు ఒంటికాలిపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికులు లేతకారి కుమార్, రాజేష్, మల్లాగౌడ్, మారయ్య, వెంకటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రబలుతున్న వ్యాధులు

- చాపకింద నీరులా విస్తరిస్తున్న జ్వరాలు
- జిల్లాలో 7 డెంగీ కేసుల నమోదు
- వైరల్ జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు



నిల్వ నీటిలో మందు చల్లుతున్న వైద్య సిబ్బంది



జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలోని ఓపెన్ ప్లాట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం



లక్ష్మీనగర్‌కాలనీలో ఓపెన్ ప్లాట్‌లోకి మురుగునీరు

మంచిర్యాల జిల్లాలో ఆరేళ్లుగా నమోదవుతున్న వ్యాధులు

వ్యాధి	2018	2019	2020	2021	2022	2023
డెంగ్యూ	88	346	32	118	116	7
మలేరియా	3	2	9	0	3	0

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాలో సీజనల్ వ్యాధులు దడ పుట్టిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ నీరు నిలువడంతో దోమలు విజృంభిస్తున్నాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు వారి డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలను వర్షాకాలం ప్రారంభానికి ముందే చేపట్టాల్సి ఉన్నా ఈ ఏడాది మాత్రం ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టలేదు. జిల్లాలో వర్షాలు కురవడం, వేసవి కాలం మాదిరి ఎండలు దంచి కొట్టడంతో వాతావరణం వర్షాకాలానికి భిన్నంగా ఉంది. దీంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతూనే, దోమల విజృంభణతో వ్యాధుల బారిన పడుతున్నారు.

అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు, వ్యాధులు విజృంభించినప్పుడు నివారణకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలి. మున్సిపాలిటీలో, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఇలా అన్ని శాఖలు కలిసి సమన్వయంగా పనిచేయాలి. ప్రస్తుతం మున్సిపాలిటీల్లోని కార్మికులు మాత్రమే పారిశుధ్య పనులను చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కేవలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశాలకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి అవగాహన కల్పించడం లేదు. ప్రతీ శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిరంతరం జరిగేలా అన్ని ప్రభుత్వ శాఖలు చూడాల్సిన బాధ్యత ఉంది.

పెరుగుతున్న జ్వరాలు...

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలో డెంగీ కేసులు ఇప్పుడిప్పుడే నమోదు అవుతుండగా, జ్వరాల సంఖ్య రోజురోజుకు పెద్ద ఎత్తున పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రతిరోజు ఓపి 300ల వరకు ఉంటే, ఇటీవల ఈ సంఖ్య 400లకు పైగా పెరిగింది. జిల్లాలో గతేడాది డెంగీ కేసులు 116 నమోదు కాగా ఈ ఏడాది 7 కేసులు నమోదయ్యాయి. మలేరియా కేసులు గతేడాది 3 నమోదు కాగా, ఈ ఏడాది ఒక్కటి కూడా నమోదు కాలేదు. డయేరియా కేసులు గతేడాది 1,169 నమోదు కాగా, ఈ ఏడాది 2,432 నమోదయ్యాయి. టైఫాయిడ్ కేసులు గతేడాది 2,031 నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 924 నమోదు కాగా, జ్వరాలు గతేడాది 5,300లు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 3,141 నమోదయ్యాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు చిన్నారులు, పెద్దలు, వృద్ధులతో నిండుతున్నాయి.

జిల్లాలో అప్రమత్తం చేశాం



జిల్లాలో డెంగీ కేసులు పెరగకుండా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. జిల్లా ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణకు ఎలిసా టెస్టును ఉచితంగా చేస్తున్నారు. అనుమానితుల నుంచి సేకరించిన శాంపిళ్లను టెస్టుకు పంపించి, ఆ రిపోర్టు ఆధారంగానే డెంగీని నిర్ధారణ చేస్తాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సీజనల్ వ్యాధులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ మీటింగ్ పెట్టాం. గత నెలలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లకు రెండు రోజుల పాటు అవగాహన సదస్సును నిర్వహించాం. అన్ని రకాల మందులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. పీహెచ్‌సీల వారిగా పరిశీలన చేస్తున్నాం.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

'ట్రేడ్ యూనియన్లు యాజమాన్యాలకు తొత్తు'



మాట్లాడుతున్న కామెర గట్టయ్య

పాతమంచిర్యాల: సింగరేణిలో ట్రేడ్ యూనియన్లు యాజమాన్యాలకు తొత్తుగా మారాయని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య, కో కన్వీనర్ నీరటి రాజయ్య ఆరోపించారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ట్రేడ్ యూనియన్లు యాజమాన్యాలతో కుమ్మక్కై కార్మికుల పోరాటాలను నీరుగారుస్తున్నాయన్నారు. కార్మికుల్లో చీలికలు తీసుకువస్తున్నారని అన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘాలు పలు అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర కమిటీ నాయకులు మిట్టపల్లి కుమారస్వామి, గొడిశెల శ్రీహరి, వెంగళ కనకయ్య, దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్‌రెడ్డి, పోశం, చంద్రశేఖర్, పురంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

22న నవోదయ 9వ తరగతి ప్రవేశపరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీల భర్తీ కోసం ఈనెల 22న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలోని పలు ఖాళీలకు ఉమ్మడి జిల్లా నుంచి 719 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని విద్యాలయం, సెంట్ క్లారిటీ స్కూళ్లలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సాగుభూమిలో వెలిసిన గుడిసెలు

- న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



సాగు భూమిలో వేసుకున్న గుడిసెలు

జన్నారం: 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమిలో కొందరు గిరిజనులు అక్రమంగా గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. 2011లో లక్ష్మీపూర్ తండాకు చెందిన బుక్య బలిరాం, శశికళ, శివకుమార్, శ్రీనివాస్, చంద్రకళతోపాటు మరికొందరు ఈ భూమిని చదును చేసుకుని గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు పత్తి విత్తనాలు వేయగా, అప్పుడు అటవీ అధికారులు, పోలీసులు ఆధ్వర్యంలో గుడిసెలు తొలగించి కేసులు నమోదు చేశారు. ఆ సమయంలో బుక్య బలిరాం మరికొందరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో అధికారులు కొన్నిరోజులు వదిలేశారు. అప్పటినుంచి బలిరాంతోపాటు మరికొందరు సుమారు 20 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నారు. ఇటీవల లక్ష్మీపూర్ తండాకు చెందిన కొందరు అక్రమంగా గుడిసెలు వేసుకున్నట్లు బలిరాం శశికళ, చంద్రకళ విలేకరులకు తెలిపారు. పత్తి పంటను తొలగించి గుడిసెలు వేసుకున్నారని వాపోయారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు దృష్టిసారించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సై సతీశ్‌ను సంప్రదించగా, దాడికి పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేశామన్నారు.

అడవిలో అక్రమంగా గుడిసెలు

- జన్నారం అటవీ డివిజన్ పరిధిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..



ఆదివాసీ గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలో కొందరు అక్రమంగా గుడిసెలు వేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందన్‌పల్లి రేంజ్ హాస్టల్‌తండా గ్రామ పంచాయతీకి గుండువాయి ఆలయ సమీపంలో దట్టమైన అడవిలో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన సుమారు 20 మంది ఆదివాసీ గిరిజనులు అక్రమంగా గుడిసెలు వేసుకున్నారు. వేసవి నుంచే చదును చేసి గుడిసెలు వేసుకుని బావి తవ్వుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. గత కొన్నినెలలుగా వారు ఉంటున్నట్లు విషయం అధికారులకు తెలిసింది. ఐదు రోజులు క్రితం వెళ్లి వారిని గుడిసెలు తొలగించాలని సూచించారు. తమ పూర్వీకుల పట్టా భూమి ఉందని, అందుకే గుడిసెలు వేసుకున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ఇచ్చినా ససేమిరా ఒప్పుకోలేదు. సోమవారం పోలీసులతో వచ్చి మరోసారి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏదైనా ఆధారాలు ఉంటే లీగల్‌గా వెళ్లాలని, ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాలని సీఐ కృష్ణారెడ్డి సూచించారు. కుల పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని వారు చెప్పినట్లు రేంజ్ అధికారి హాఫీజొద్దీన్ తెలిపారు. ఎస్సై సతీశ్, డీఆర్వో శ్రీరాం తదితరులు ఉన్నారు.

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



రోదిస్తున్న మృతురాలి తల్లి సుమిత్ర



ఆదె అంజలి(ఫైల్)

- తేజిగూడలో ఘటన
- కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు

వాంకిడి: వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని తేజిగూడ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొత్రే సుమిత్ర, బాలాజీ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. కుమార్తె అంజలి(18)కి అదే గ్రామానికి చెందిన ఆదె శంకర్‌తో మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిపించారు. పెళ్లయిన కొన్ని రోజులకే అల్లుడు వరకట్నం అడుగుతున్నాడని అంజలి ఇంటికి వచ్చి తల్లిదండ్రులతో చెప్పింది. రూ.లక్ష ఇచ్చి ఆమెను అత్తారింటికి పంపించారు. కొన్ని నెలలకు అంజలికి కూతురు పుట్టింది. అప్పటి నుంచి భర్త శంకర్, అత్త తానుబాయి, మామ రంగయ్య, మరిది సోమయ్య కలిసి మరో రూ.లక్షతోపాటు వ్యవసాయ భూమిని అదనపు కట్నంగా తేవాలని మానసికంగా, శారీరకంగా హింసించేవారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన అంజలి ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి తన చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలికి ఏడాదిన్నర కూతురు ఉంది. తమ కుమార్తె ఆత్మహత్యకు అత్తింటివారి వరకట్న వేధింపుల కారణమని మృతురాలి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

ఆత్మహత్యపై అనుమానాలు..

అంజలిని గొంతునులిమి అత్తింటివారు హత్యచేసి ఉంటారని, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకే చీరతోనే ఉరివేసి వేలాడదీశారని మృతురాలి తల్లి, కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఒకే గ్రామంలో ఉన్న అంజలిని తమతో కలవనిచ్చేవారు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరునెలల క్రితం కూతురు అత్తారింటికి వెళ్తే నేడు శవమై పుట్టింటికి వచ్చిందని కన్నీరుమున్నీరుగా విలపించారు. తన పత్తి పంటలో గ్రామస్తులతో కలిసి ఆదివారం ఎరువులు వేసేందుకు వెళ్లిన అంజలి నేడు శవమై ఉండటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- పంటల సాగులో అన్నదాతలకు సాయం
- సందేహాల నివృత్తికి సలహాలు, సూచనలు

ఎరువుల డీలర్లకు దేశీ శిక్షణ



కిష్టంపేట రైతువేదికలో ఎరువుల డీలర్లకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త

చెన్నూర్‌రూరల్: వ్యవసాయంలో అన్నదాతలకు అనేక సందేహాలు ఉంటాయి. వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేయడం వ్యవసాయశాఖ అధికారులకు అది సాధ్యం కాదు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం విత్తన, ఎరువుల దుకాణదారులకు ప్రత్యేకంగా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్(దేశీ) శిక్షణ ఇస్తోంది. వారానికి ఒక రోజు చొప్పున 42 వారాల పాటు పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో విత్తనాలు, ఎరువుల మందులు విక్రయించే డీలర్లు రైతులకు సలహాదారులుగా నడుచుకోవాలన్నది ప్రభుత్వం లక్ష్యం.

జిల్లా వ్యాప్తంగా..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 3.60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతున్నాయి. అందుకుగాను 55 మంది ఏఈవోలు సాగులో రైతులకు సలహాలు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిజ్ఞానం మరింత అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఎరువుల డీలర్లకు ఒక్కో బ్యాచ్‌లో 40 మందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రెండు బ్యాచ్‌లు శిక్షణ పొందుతున్నాయి. శిక్షణ అనంతరం పంటల సాగులో అవగాహన పెంచుకున్న తమ వద్దకు వచ్చే రైతులకు డీలర్లు తగిన సూచనలు ఇస్తున్నారు. ఎరువులు, పురుగుల మందుల వినియోగం తెలియని అన్నదాతలు పలు ప్రకటనలకు ప్రభావితం అవుతున్నట్లు గుర్తించారు. పైరుకు సోకిన తెగులు గురించి సరైన అవగాహన లేక తోచిన పురుగుల మందు, ఎరువులను వినియోగిస్తున్నారు. పంటకు సోకిన తెగులును అధ్యయనం చేసి మరింత సమాచారానికి అవసరమైతే ఏఈవోలను సంప్రదించి డీలర్లు రైతులకు సలహాలు ఇస్తున్నారు. దుకాణాలు వచ్చిన రైతులకు డీలర్లు అవగాహన కల్పించడంతో ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ ఆర్థికంగా అన్నదాతలు నష్టపోకుండా చూస్తామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

ధ్రువపత్రాలు అందిస్తున్నాం



రైతులకు మేలు జరగాలనే ఎరువుల డీలర్లకు శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందజేస్తున్నాం, పంటల సాగులో ఎరువులు, పురుగుల మందులపై రైతులకు డీలర్లు అవగాహన కల్పిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు. ఎరువులు, పురుగుల మందులు ఎంత మోతాదులో వాడాలో తెలియజేస్తారు.

– కవిత, ఏవో, చెన్నూర్

ఇద్దరికి ప్రతిభరత్న పురస్కారాలు



పురస్కారాలు అందుకుంటున్న రాజు, వెంకటేశ్

శ్రీరాంపూర్: వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చినవారికి హైదరాబాద్‌లో సర్వేజన సుఖినోభవంతు సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలు అందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీరాంపూర్‌కు చెందిన ఆరుముళ్ల రాజు, జె.వెంకటేశ్‌లకు ప్రతిభరత్న పురస్కారాలు అందజేశారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు కృష్ణారెడ్డితో ఈ పురస్కారాలు అందుకున్నారు. జేసీఐ ద్వారా వ్యక్తిత్వవికాస శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టినందుకుగాను వీరికి పురస్కారాలు అందించారు. కేంద్ర నాటక అకాడమీ సభ్యురాలు పి.భారతి, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యుడు వెంటపాటి కృష్ణాది శేషు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

కాసిపేట: కార్మికులు, అధికారులు రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తి సాధించాలని బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం గుప్తా తెలిపారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై రక్షణ అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రమాదాలను ముందస్తుగా గుర్తించడం, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్(ఎస్‌ఎంపీ), సేఫ్ ఆపరేటింగ్ ప్రోసిజర్‌పై అవగహన కల్పించారు. నా రక్షణే నా బాధ్యత నుంచి నా రక్షణ కుటుంబ బాధ్యతగా సొంతంగా రక్షణ పొందాలని తెలిపారు. ఈ నెలంతా రక్షణ అవగాహన సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటిసారి గనికి వచ్చిన సేఫ్టీ జీఎంను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. గని మేనేజర్ అల్లావుద్దీన్, సింటాస్ అధికారి శర్మ, రక్షణాధికారి సునీల్‌కుమార్, టీబీజీకేఎస్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శులు శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవాలి

- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి



శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఖర్చును మరింత తగ్గించుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు, ప్లానింగ్) జి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ముందుగా ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించి అధికారులతో మాట్లాడారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వారికి సూచనలు చేశారు. వర్షపు నీటిని క్వారీలో వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఓబీ కాంట్రాక్టర్లతో ఓబీ వెలికితీతపై చర్చించారు. అనంతరం జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి సీసీసీలోని సింగరేణి గెస్ట్ హౌస్ ఏరియా అధికారులతో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియాలో భూగర్భ గనులు ఎక్కువగా ఉన్నందున ఉత్పత్తి ఖర్చు అధికమై నష్టాలు వస్తున్నాయన్నారు. దీనికోసం యంత్రాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గనులవారీగా నిర్దేశించి..సాధించిన ఉత్పత్తిని సమీక్షించారు. మెటీరియల్ కొరత, యంత్రాల విడిభాగాలపై అధికారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమం అనంతరం డైరెక్టర్ జీఎం కార్యాలయం ముందు ఉన్న నర్సరీలో మొక్కలు నాటారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటూ ఎం.రఘుకుమార్, ఏరియా ఇన్‌చార్జి ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీ అధికారులు పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, డీజీఎంలు చిరంజీవి, యాదయ్య, అరవిందరావు, సర్వే అధికారి సంపత్ ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



నితిన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్–పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీతానగర్‌కు చెందిన విమల (40) చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాగజ్‌నగర్ మండలం సీతానగర్ గ్రామానికి చెందిన నితిన్(22) ఆమె తల్లి విమల, బంధువు శేఖర్ బైక్‌పై వెళ్తున్నారు. విద్యుత్ స్తంభాలను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను రాస్పెల్లి వద్ద ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో విమల, నితిన్ తీవ్రంగా గాయపడగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నితిన్ ఆదివారం మృతి చెందగా, తల్లి విమల చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కాగా నితిన్ అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. మృతదేహానికి జెడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులు..



అనాథలైన చిన్నారులు

పిల్లల చిన్నవయస్సులోనే విమల భర్త రవి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి నితిన్‌తోపాటు ఇద్దరు కవలలు హర్షిత్, వర్షిత్‌ల బాగోగులు విమలే చూసుకుంటుంది. స్వగ్రామం సీతానగర్‌లో ఉపాధి దొరక్కపోవడంతో తల్లిగారి ఊరు దహెగాం మండలం బోర్లకుంటలో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ పుట్టింటి నుంచి వచ్చిన మూడెకరాలతోపాటు మరో రెండెకరాలకు కౌలుకు తీసుకుని పత్తిసాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్నెళ్ల క్రితమే పెద్దకుమారుడు నితిన్‌కు వివాహం జరిగింది. తల్లితోపాటు సోదరుడిని కోల్పోయిన పదకొండేళ్ల చిన్నారులు అనాథలు మారారు. పెద్ద దిక్కు లేకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.విమల మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంటుందని బంధువులు తెలిపారు.